ఆదివారం - మధ్యాహ్నం. ఇంట్లో అంతా నిశ్శబ్దంగా ఉంది. ముందు గదిలో మంచం మీద తండ్రీ, కింద పక్కేసుకుని తల్లీ, చెల్లీ నిదురపోతున్నారు. రెండో గదిలో కూర్చుని పుస్తకం తిరగేస్తున్నాడు మురళి. అతడి మనస్సు పాఠం మీద నిలవటం లేదు. తన పదో తరగతి ''హాఫ్ ఇయర్లీ'' పరీక్షలు మరో పది రోజుల్లో ఉన్నాయి. చూపులైతే పుస్తకం మీద ఉన్నాయి కానీ మనస్సంతా ఆలోచనలతో సతమతమవుతోంది.




# పెన్ను

-కె. శ్రీకాంత్

అతడు కూర్చున్న మంచం గోడకు ఆన్చి ఉండటంతో, వీపును గోడకు ఆన్చి కాళ్ళు జాపుకుని ఒడిలో పుస్తకం పెట్టుకుని తిరగేస్తున్నాడు. అతడు కూర్చున్న మంచానికి కొద్ది దూరంలో తలుపుకు తండ్రి షర్టూ, ఫాంటూ వేలాడదీసి ఉన్నాయి. తెల్లటి పల్చటి షర్టు జేబులోంచి నోట్ల దొంతర కనపడుతోంది. పది రూపాయల నోటు పల్చటి షర్టులోంచి బయటకు కనిపిస్తోంది.

తలెత్తి షర్టు వంకా, జేబులోంచి కనిపిస్తున్న పది రూపాయలనోటు వంకా చూసాడు.

పదిహేను రోజులక్రితం తన స్నేహితుడు కొన్న ఇంక్‌పెన్ అతడి మనస్సుని నిలవనివ్వటం లేదు. పాతిక రూపాయల ఖరీదుగల పెన్నది - ఉత్తినే అలాంటి పెన్ను కొనివ్వమని అడిగితే ఇప్పుడు అంత

ఖరీదైన పెన్ను తనకవసరం లేదన్నాడు.

అతడికి మాత్రం ఆ పెన్నుపై ఆకర్షణ రోజురోజుకీ పెరగసాగింది. క్లాసులో గోపీ ఆ పెన్ను గురించి అందరికీ గొప్పగా చెబుతుంటే, తన తండ్రి తనకీ అలాటి పెన్ను తెస్తాడని అందరికీ చెప్పాడు - రెండోరోజు నుంచి అందరూ అడగటం 'ఏరా పెన్ను తేలేదేమిటని' - ''ఈ రోజు తేలేదు - రేపు తెస్తానన్నాడ''ని చెప్పాడు మొదటి రోజు ... రెండు ... మూడు ... నాలుగు రోజులు అదే జవాబు చెప్పేడు తను. తరువాత అది మామూలైపోయింది. ఇక ఐదోరోజు నుంచి అందరూ తనను వెక్కిరించటం మొదలుపెట్టారు - 'గప్పాలు కొడుతున్నానని'. తరువాతిరోజు నుంచి స్కూలుకి వెళ్ళాలంటేనే ఇబ్బందిగా అనిపించింది. క్లాసంటేనే ఏవగింపూ... కసీ మొదలయ్యేయి. అసలు పెన్ను మూలానే ఇదంతా మొదలయ్యింది. పెన్ను కొని క్లాసుకు వెళ్ళేవరకూ స్కూలుకు వెళ్ళకూడదని నిశ్చయించుకున్నాడు.

రెండు రోజులు ఒంట్లో బావోలేదని సాకు చెప్పి ఇంట్లో కూర్చున్నాడు. ఈ వేళ ఆదివారం - రేపు సోమవారం - ఎలాగైనా క్లాసుకి పెన్ను తీసుకువెళ్ళాలి - ఎలా? పెన్ను తీసుకువెళ్ళి అందరికీ గర్వంగా చూపించాలి - అప్పుడు చూడాలి అందరి ముఖాలూ ఎలా ఉంటాయో-

అతడి మనస్సంతా గజిబిజిగా మారింది. ఎదురుగా కనపడుతోన్న పది రూపాయలనోటు మనస్సుని మాయ చేస్తుంది. అతడి కళ్ళకి పది రూపాయల నోటు తప్ప మరేమి కనిపించటం లేదు.

''నాన్న జేబులోంచి డబ్బు తీస్తే?'' ''అమ్మో... చంపేస్తాడు... మరి ఎలా...పెన్ను ఎలా ... రేపుకి స్కూలుకి ఎలా? తన తండ్రి ఎంత స్ట్రిక్ట్‌గా ఉంటాడో తనకు తెలియందికాదు... ఏం చేసినా సహిస్తాడు కానీ ఏదైనా తప్పు పని చేస్తే అస్సలు ఊరుకోడు.

ఓసారి మార్కులు తక్కువ వస్తే, ఇంట్లో ప్రోగ్రెస్ రిపోర్ట్ చూపించకుండా తనే నాన్న సంతకం అనుకరించి రిపోర్ట్‌పై సంతకం పెట్టి ఇచ్చాడు స్కూల్లో. తరువాత ఆ విషయం అడిగితే తనకేమీ తెలీదని అబద్ధం చెప్పేడు. ఒళ్ళు వాతలు తేలిందాకా కొట్టడం ఇంకా జ్ఞాపకమే, మార్కులు తక్కువ వచ్చినందుకు కాదు, అబద్ధం చెప్పినందుకు, అలాటి పనిచేసినందుకు.

ఇప్పుడు పెన్నుకి డబ్బెక్కడ నుంచి తేవాలో అర్థం కావటం లేదు. ఇరవై రూపాయలు కావాలి.. తన దగ్గర ఐదు రూపాయలున్నాయి. ఇరవై రూపాయలు కావాలి...

పుస్తకం మూసివేసి మంచంమీద పడుకున్నాడు. కళ్ళు మూసుకుని నిదురించటానికి ప్రయత్నించేడు. ఊహ సాధ్యం కావటం లేదు. కళ్ళు మూసుకున్నా మనస్సులో తండ్రి షర్టే మెదులుతోంది. 'తండ్రి జేబులోంచి డబ్బు తీస్తే' అన్న ఊహ ఇంతై, ఇంతింతై అన్నట్టు పెరగసాగింది.

నాన్న జేబులోంచి డబ్బు తీస్తే - తరువాత చూసుకుని అమ్మనడుగుతాడు 'డబ్బు తీసేవా' అని - లేదంటుంది. చెల్లాయికి షర్టు ఎలాగూ అందదు.మిగిలేది తనే. తనను అడుగుతాడు - తను తీయలేదని చెబుతాడు. నాన్నమాత్రం చూస్తున్నాడా తను డబ్బు తీసేటప్పుడు .. పెన్ను కొనివ్వమంటే కొనివ్వలేదు... అలాంటప్పుడు తను చెప్పకుండా తీసుకోవటంలో తప్పు లేదు.

ఓ నిశ్చయానికి వచ్చినట్టు లేచి మంచం దిగాడు.



''మీరురాస్తున్న కథలకు ఆధారం నమసమాజంలోని ఒడిదుడుకులంటాను ఏమంటారు?'' అడిగాడు విలేఖరి.

''అదేంకాదు? పాత పత్రికలు'' ఠక్కున నోరుజారాడు రచయిత రంగావధాని.

రాయవరపు రవి
రామాయంపేట

అతడి గుండె వేగంగా కొట్టుకుంటోంది. మెల్లగా అడుగులు వేసుకుంటూ ముందు గదిలోకి తొంగి చూశాడు. తండ్రీ, తల్లీ, చెల్లాయి గాఢంగా నిదురోతున్నారు. తిరిగి వచ్చి మంచంపై కూర్చున్నాడు. మనస్సు రెండు వైపులా కొట్టుమిట్టాడుతోంది.

అతడు లేచి నిల్చుని తలుపువైపు నడిచాడు. గదిలో ఫాన్ తిరుగుతున్నా చమటలు పడుతున్నాయి. తండ్రి షర్టు జేబులో చెయ్యి పెట్టాడు. కనిపించిన పది రూపాయలు, వెనుకగా ఉన్న ఇరవై రూపాయల నోటూ బయటకు వచ్చాయి. ఓసారి ముందుగది వైపు చూసి ఇరవై రూపాయల నోటు జేబులో పెట్టుకుని పది రూపాయల నోటుని తిరిగి యధాస్థానంలో పెట్టాడు.

తన దగ్గరున్న ఐదు రూపాయలు కూడా తీసుకుని, చప్పుడు కాకుండా వెనుక గదితీసి బయటపడ్డాడు.

బయట గాలి చల్లగా ఉంది. తన ఇంటికి ఓ వంద గజాల దూరంలో ఉన్న స్టేషనరీ షాపు వైపు నడువసాగాడు. నుదుటన పట్టిన చెమటను కుడిచేతితో తుడుచుకుంటూ మనసంత అయోమయంగా ఉంది. తను చేస్తున్నది మంచిపనేనా? ఓ వైపు సమర్థించుకుంటున్నాడు. కానీ మరో వైపు ఎక్కడో మనస్సు అట్టడుగు పొరల్నుంచి అది సరైన పని కాదని ఏదో చెబుతోంది.

అతడికి ఎప్పుడో తన తండ్రి ఏదో సందర్భంలో అన్న మాటలు గుర్తుకు వచ్చాయి. 'సొంత ఇంటిలో దొంగతనం చేయడం కన్నా నీచమైన పని మరొకటి లేదని'. ఆ మాటలు ఇప్పుడు తనను ఉద్దేశించి అంటున్నట్టు అనిపించసాగేయి. ఒక వేళ నాన్నకి తను దొంగతనం చేసినట్టు తెలిస్తే..... ఇంతకు ముందులా ప్రేమగా ఉండగలడా- ఏమో - నాన్నకి విపరీతమైన కోపం వస్తే ఏం చేస్తాడో తనకు బాగా తెలుసు.... ఎవ్వరితోనూ మాట్లాడడు..... తనతోనూ, చెల్లాయి తోనూ ఏదో ముక్తసరిగా మాట్లాడేవాడు.

ఇప్పుడు నాన్న తనతో కూడా మాట్లాడడు... కొట్టినా ఫరవాలేదు.. కానీ మాట్లాడకుండా ఉంటే.....

షాపు దగ్గరపడుతుంది. చుట్టూ చూసాడు. రోడ్డుపై నడుస్తూనే - రోడ్డుపై నడుస్తున్న కొద్దిమందీ తనవైపే అపరాధిగా చూస్తున్నట్టు అనిపించసాగింది. గిల్టీగా అనిపించింది... ఒక్కక్షణమే.....తిరిగి అతడికి స్కూలు జ్ఞాపకం వచ్చింది. తన క్లాస్‌మెట్స్ చేసే వెక్కిరింతలూ.... గప్పాలు కొడుతున్నాడని వాళ్ళనే మాటలు... ఊహు నాన్నకి తెలీదులే.... పెన్ను కొనుకొచ్చి, దాచివేయాలి. రేపు స్కూలుకు వెళ్ళాక శ్రవణికి ఇచ్చి రోజూ స్కూలుకి తెమ్మని చెప్పాలి.

చప్పున తండ్రి ముఖం గుర్తుకు వచ్చింది.

''చూడు కన్నా, ఎప్పుడూ తప్పుడు పనులు చేయవద్దు. నీకు మార్కులు వచ్చినందుకు నాకు బాధగా లేదు.... నువ్వు అబద్ధం చెప్పినందుకు బాధగా ఉంది. నువ్వు అలాటి పని చేసినందుకు బాధగా ఉంది.... మరోసారి అలాటి పని చేయకేం.... దెబ్బలవల్ల అయిన గాయాలకు వెన్నె రాస్తూ తండ్రి అన్న మాటలు జ్ఞప్తికి వచ్చాయి. తను వెక్కెళ్ళతో ఏడుస్తూ మరోసారి అలాంటి పని చేయనన్నాడు. కాని ఇప్పుడు చేస్తున్నదో....? కుదించుకుపోతున్న భావన. కానీ స్కూల్లో, నిక్సన్, ప్రమోద్, విజయ్ అందరూ ఏడిపించుకు తినే వెధవలే...

అతడు షాపులోకి అడుగు పెట్టాడు. షాపులో సేల్స్‌మేన్ తప్ప ఎవరూ లేరు. సేల్స్‌మేన్ అడిగాడు.

''ఏం కావాలి బాబూ?''

తన తండ్రికి ఏం సమాధానం చెబుతాడు. తన్నోసారి నాన్న కొడితే ఆ దెబ్బలు చూసి అమ్మ కూడా ఏడ్చింది... అమ్మ ఏడ్వడం చూసి చెల్లాయి కూడా ఏడవటం ప్రారంభించింది. వద్దు... పెన్ను లేకపోయినా ఫర్లేదు.... నిక్సన్ గాడి గురించి టీచర్‌కు రిపోర్టు చేస్తే సరి-

''ఏం కావాలి బాబూ?''

''ఉహు పెన్ను వద్దు... నాన్న కావాలి.... నాన్న కావాలి... పెన్ను ఇవాళ కాకపోతే రేపు కొనుక్కోవచ్చు.. కాని నాన్న... వద్దు.

ఏం కావాలి'' సేల్స్‌మేన్ విసుగ్గా పెద్దగా అడిగాడు.

అతడేం జవాబివ్వకుండా చప్పున షాపులోంచి బయటపడి ఇంటికి పరిగెత్తాడు.

నాన్న లేచి ఉండకపోతే బావుండు....

మరింత వేగంగా కింద ఏముందో పట్టించుకోకుండా వేగంగా మరింత వేగంగా ఇంటికేసి పరిగెత్తాడు. ఇంటి దగ్గరకు వచ్చేసరికి ఆయాసం వచ్చింది. ఒళ్ళంతా చమటలు పట్టాయి. శబ్దం కాకుండా గేటు తీసి లోపలికి వచ్చి గేటువేసి ఇంటి వెనకకు వచ్చాడు. అతడు పీలుస్తున్న శ్వాస అతడికే పెద్దగా వినిపిస్తోంది. గుండె చప్పుడు స్పష్టంగా వేగంగా బ్రిడ్జ మీద రైలులా దడదడలాడుతోంది.

ముందు గదిలో ఏవో మాటలు వినబడుతున్నాయి. గుండె గుభేల్ మంది. నాన్న లేచినట్టున్నాడు. గుండె మరింత వేగంగా కొట్టుకోసాగింది. మెల్లగా తలుపు తోసి లోపలికి వచ్చి తలుపు వేశాడు. తన గదిలోకి వస్తూ ముందుగదిలోకి చూశాడు. ఒక్కసారిగా పోయిన ఊపిరి తిరిగి వచ్చినట్టయ్యింది. తండ్రి అలాగే ప్రశాంతంగా నిదురోతున్నాడు. తల్లీ, చెల్లీ అలాగే పడుకొని ఉన్నారు. ఇందాక తనకు వినిపించిన మాటలు భ్రమా? ఇరవై రూపాయలు తీసి తండ్రి షర్టు జేబులో పెట్టి వచ్చి మంచంపై కూర్చున్నాడు. అప్పటిదాకా దేహమంత అనుభూతి చెందని ఒక బరువైన భారమైన అనుభూతి తేలికయ్యింది. మనసంతా చెప్పలేని స్వేచ్ఛ ఆవరించుకుంది. ఏదో భావన.... తనూ అందరి లాంటి వాడినేననే భావన..... తన కుటుంబంలో తానూ ఒకడేనన్న భావన... ఇందాకటి అశాంతీ, చికాకూ అన్నీ మాయమయ్యాయి. కరెంట్ పోయి ఎంతసేపయ్యిందో ఫాను తిరగడం లేదు. చమటలు పడుతున్నాయి. వేగంగా కొట్టుకుంటున్న గుండె చప్పుడు క్రమస్థాయికి వచ్చింది. అలాగే మంచంపై ఒరిగి గాఢ నిద్రలోకి జారుకున్నాడు.

●